# మబ్బు పట్టినరాత్రి

ఖైమా చేయబడి రాలిన వెన్నెల ముద్దల్లా, తెల్లగా మెరుస్తోంది ప్రత్తి చేను. విచ్చుకున్న ప్రత్తి పూలు గుప్పెడు గుప్పెడు ప్రత్తి నురగలు కక్కుతున్నట్టు.... చేనంతా ఆహ్లాదకరంగా వుంది. చాలామంది ఆడవాళ్ళు గోనెసంచుల్లో ప్రత్తిని ఏరుతున్నారు.

సామిరెడ్డి వాళ్ళ పనిని పురమాయిస్తూ.... చేనంతా కలియతిరుగుతున్నాడు. ఏపుగా, భుజాలదాకా పెరిగింది చేను.

ప్రత్తి మెత్తదనాన్ని కొసవేళ్ళతో స్పృశిస్తూ ఏదో లోకంలో వున్న సిన్ని... అలికిడై ఉలిక్కిపడింది. ఎదురుగా సామిరెడ్డి.

"ఏందే సిన్ని... మొగని కాడ రంధి పెట్టుకున్నావా? ఆడు మస్కట్ బోయి ఆరేడు ఏండ్లు తిరిగె. అక్కడ ఆడెట్ల సచ్చినా... ఇక్కడ నువ్వు సెగల్తోని రాత్రిళ్ళు నిద్రబోలేనట్లున్నవ్...." మిడిసి పడుతున్న 'సిన్ని' అందాల్ని కళ్ళతోనే తాగుతూ అన్నాడు సామిరెడ్డి.

ఆ మాటకి సిన్ని సిగ్గుపడి నవ్వింది. ప్రత్తి పువ్వుకన్నా తెల్లగా... మెత్తగా.... "గదేందోగాని.... గీ మస్కట్ దుబాయ్‌ల కథలు రాన్రాను పాడుకచ్చినయ్....గా లచ్చిగాన్ని గిట్లనే ఏజెంటుగాడు మస్కట్ పంపిత్తనని బొంబాయిల దీస్కపోయి ఇడిసిపెట్టిండట. ఇంగాడు ఇంటికచ్చుటానిక్కి 'నామోసి' అన్పిచ్చి బొంబాయిల్నే తట్టమోసుకుంట బతుకు

తున్నాడట. ఇప్పుడు ఉత్తరంల మత్లబ్ రాసిండు. ఫైసల్ దీస్కున్న ఏజెంట్ గాడు పత్తాలేడట.

గట్లనే గా సలీంబాయ్ సుత మస్కట్ పోతున్నానని అలాయ్ బలాయ్ దీస్కునే.... అన్ని మలేషియా విమానమెక్కిత్తె పోరడు తెల్వక అటేపోయి గదే మస్కటనుకొని ఆడ పస్లేక అవారగురుపు నెక్క తిరుగుతుండట.... మస్కట్ కథలు గిట్లున్నయ్...."

సామిరెడ్డి మాట్లాడుతూనే దిక్కులు చూస్తూ 'సిన్ని' దగ్గరగా వచ్చాడు. సిన్ని గువ్వ పిట్టలా ముడుచుకుపోయి గుబులుగా సిగ్గుపడింది.

"పత్తిని జెల్ది జెల్ది తెంపరాదు.... గిట్లయితే నీకు కైకిలేసుంత పడ్తది?" అని సిన్ని భుజానికున్న గోనె సంచిలో ప్రత్తిని పరీక్షించి... అక్కడ్నించి సామిరెడ్డి చేయి మెల్లగా సిన్ని రొమ్ము మీదకి పాకింది.

పెళ్ళయిన ఏడాదికే 'పెనిమిటి' మస్కట్ పోయాక ఆరేళ్ళనించి చంపుకొంటున్న కోర్కెలేవో... జివ్వున పొంగాయి సిన్ని నరాల్లో... వయసు తెచ్చిన ఆరాటం పిచ్చిలేపుతోంది.

చుట్టూ చూసింది భయంగా... అక్కడక్కడా ఎవరి పనుల్లో వారున్నారు.

సామిరెడ్డి చేతులు ఎక్కడెక్కడో పరిగెడుతుంటె... సిన్ని కాదన లేక పోతోంది. పదినిమిషాల తర్వాత అటు దిక్కుగా 'రాజడు' వస్తూ కన్పించాడు.

అదిచూసి తప్పుకుంది సిన్ని...

"ఏంద్ర రాజీగా... ఏటోవత్తివి" చిరాగ్గా అడిగాడు సామిరెడ్డి.

" నీ దగ్గిరికే అచ్చిన...."

"మల్లెందిరా... ఫైసల్ గిట్ల గాపడ్రా?"

"అవునయ్యా... ఇగొక్క అయిదు నూర్లుండె ఇయ్యరాదు"

"ఏంద్రో....? నువ్వసలు 'మస్కట్' పోతావ్రా... నీయవ్వ.... ఇదివరికే రెండుపేలిత్తి"

"ఇంగ గిన్నియ్యరాదు... మస్కట్ పోయినంక 'మిత్తితోని' పంపిత్త. ఇంగ ఇయ్యాల్లో రేపో 'ఈసా' వత్తది."

"నీ... నువ్వేపన్ననుకోరా.... నాదగ్గరెల్లయ్"

"గట్లంటెట్ల బాంచెన్.... నామీద నమ్మకలేదా?"

"ప్రత్తి చేన్ల నాకే 'లాస్' అత్తంది. ఇగ నీకేమియ్యాలే' సామి రెడ్డికి అసహనంగా వుంది వాడిరాక. సిన్ని మౌనంగా వాళ్ళమాటలు వింటోంది.

"మరొక్క బీడన్నపారెయ్" రాజడు కూడా చిరాకు పడ్డాడు.

"ఏంద్రో 'తైసు'కు రావడ్తివి.... బీడి బంగారమాగనీ.... అవు న్నార రాజిగా... మొన్న గకీల ఏదో 'బైసు' జరిగిందట గద్రా. గా గుత్తెదురుగాడు పోషిగాని బిడ్డను ఏమో అన్నడట...."

"ఏమో... నాకు తెలుత్తదా ఏంది" బీడి ముట్టిస్తూ చెప్పాడు రాజడు.

"గకీలకోతలేవ్రా... పాలెర్ తనం బందేసినవా?"

"నీ... 'అన్న'లకు భయపడి దొరపట్నాలపొంటనె వాయె... ఇగ పాలెర్ తనం ఎవనికుండాలె?"

"మరి దొర ఎవ్సం ఎవలు జేత్తంద్రా"

"ఏందివయ్యా.... ఊర్లనే వుంటివి కాటికి పొయ్యొచ్చినట్లు మాట్లాడ వడ్తివి" అంటూ రాజడు విసురుగా వెళ్ళిపోయాడు. ఆ మాటకు సిన్ని కిసుక్కున నవ్వింది.

"ఈ లంజకొడుకుల్లోని ఇదే తంట... పెడితే పెండ్లి కోరుతారు. లేకుంటే సావు కోర్తారు" అని మెల్లిగా సిన్ని చెయ్యి పట్టుకున్నాడు.

'సెమట పట్టింది. ఇప్పుడొద్దు" గొణిగింది సిన్ని.

చేనులో ఒక మూలా గుట్టగా ప్రత్తిని పోస్తున్నారు. సామిరెడ్డి అటువైపుగా పోతూ...

"రాత్రికి రా.... పండుగ సేద్దాం. నేనిక్కడే కాపలా పడు కుంటున్న. పత్తి కుప్పలో.... మెత్తగా...." అని గుసగుస చెప్పాడు.

సిన్ని నవ్వింది మత్తుగా.... మెత్తగా... ఆ నవ్వుకు ప్రత్తిపూలు వెలవెలబోయాయి.

* * *

చంద్రుడు సగంకోసిన పుచ్చకాయలా మెరుస్తున్నాడు.

ఆ వెన్నెల్లో సిన్ని పాలరాతిలా మెరుస్తోంది. ప్రత్తికుప్పలో సిన్ని మూలుగులు విని వెన్నెల వేడెక్కింది.

సామిరెడ్డి ప్రత్తి కన్నా మెత్తగా వున్న సిన్నిని పశుబలంతో నలిపేస్తున్నాడు. అలసిసొలసి పోయిన అరగంటకి.... సిన్ని నుదుటిమీద చిరు చెమటను తుడుస్తూ...

"సూత్తన్నవ్ గదా సిన్ని... సత్తిలో నష్టమొచ్చి రైతులంతా 'ఇసం' మింగి చస్తాంద్రు. మరి నాగతేమవుతోందో...."

ఆరేళ్ళనించి సిన్ని మొగుడు మస్కట్ నించి ఎంత డబ్బు.... ఎన్ని గూడ్స్ పంపుతున్నాడో సామిరెడ్డికి బాగా తెలుసు. అది దృష్టిలో వుంచుకునే ఆ మాటన్నాడు.

సిన్ని మళ్ళీ నవ్వింది...

ఆ నవ్వులో తృప్తితో కూడిన కృతజ్ఞత వుంది. సామిరెడ్డిని పొదివి పట్టుకొని... క్షణంలో మొగుడు పంపిన చేతి గడియారాన్నితీసి సామిరెడ్డి ఎడంచేతికి తొడిగింది అనాలోచితంగా.

కోర్కెను చల్లార్చిన అతనిపై ప్రేమ ఉబికి వస్తుంటె ఈసారి తనే విజృంభించింది. ఆరేళ్ళ కోర్కె ఆవిరయ్యి అలసట మళ్ళీ వచ్చేంత వరకూ...

అలా ప్రతిరోజూ....

ఇలాంటి విషయాలు పల్లెటూళ్ళలో గుప్పుమంటాయి. సామిరెడ్డి భార్యకు ఈ విషయం తెలిసినా ఏమీ అన్లేదు. కారణం... సిన్ని ఇంటి

లోని చాలా వస్తువులు (టేప్‌రికార్డర్, దుస్తులు, వాచీలు, కేసెట్లు, డబ్బు) సామిరెడ్డి ఇంటికి నడిచి వస్తున్నాయి కాబట్టి.

ఇప్పుడు సామిరెడ్డి ఒంటిమీద పులిగోరు బంగారు గొలుసుతో పాటు ఫారిన్ సెంటు గుప్పుమంటుంది. సెంటువాసనకంటె రెట్టింపుగా గుసగుసలు గుప్పుమంటూనే వున్నాయి వూర్లో.

ఎందరో ప్రత్తిరైతులు ఆర్థికంగా దిగజారినా... ఆత్మహుతులు చేసుకున్నా సామిరెడ్డి నిక్షేపంలా వున్నాడు.

కారణం... ప్రత్తిచేను కాదు.

ప్రత్తిపువ్వులాంటి... సిన్ని....!!

* * *

ఆరోజు

ప్రత్తిచేను ఎండిపోయినా.... పసుపు తోటకు నీళ్ళు పెడుతూ రాత్రి పదింటిదాకా చూశాడు సామిరెడ్డి.

ఆ రాత్రి సిన్ని రాలేదు.

వెన్నెల కాస్తున్నా... మబ్బులున్నాయి. ఆ మబ్బు తునకల సందుల్లోంచి వెన్నెల సన్నగా రాలిపడుతుంటె; ఆహ్లాదంగా వుందారాత్రి.

సామిరెడ్డి నరాలు జివ్వుమన్నాయి. కాలువను అడ్డంగా వేసి పార అక్కడే పడేసి సిన్ని ఇంటివైపు నడుస్తాంటే సిన్నిమాటలు గుర్తొచ్చాయి.

"రేపో మాపో 'పెనిమిటి' వత్తున్నట్లు మత్‌లబ్ రాసిండు. నేనింక తోట్లకు రాను. నువ్వుకూడా దూరంగా వుండు రెడ్డి దొరా.... లేకపోతే నా కాపురం నిప్పులు కురుత్తాయ్" అని భయంగా ప్రాధేయపడింది.

వెళ్ళకూడదనుకుంటూనే కదిలాడు సామిరెడ్డి. వూరు నిద్రపోతోంది. మబ్బులు మరింత దగ్గరపటం వల్ల చీకటి చిక్కబడుతోంది.

తలుపు నెట్టగానే తెరుచుకుంది పెరటితోటలో మంచంమ్మీద సిన్ని నిద్రపోలేదు... ఆలోచిస్తోంది.

సామిరెడ్డి అలికిడి విని చూసిందల్లా లేచి కూచొంది. మౌనంగా చెయ్యి వేశాడు. అడ్డు చెప్పలేదామె. ఇద్దరూ మంచంలో ఒరిగిపోయారు.

గంట తర్వాత ఇంటిముందు అలికిడి కావడంతో సామిరెడ్డి పెరటి దార్లోంచి చీకట్లో వేగంగా కల్సిపోయాడు.

సిన్ని దిగ్గున లేచింది.... నగ్నంగా....

ఎదురుగా వాడు.... మొగుడు...

పరంధాములు!!

చీకట్లో వాడికళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. గుర్తుపట్టిన సిన్ని చీర సర్దుకుంది. అతడు నిస్సహాయస్థితిలో ఆ దృశ్యాన్ని తట్టుకోలేక వెంటతెచ్చిన సామాను చిందరవందరగా ఇల్లంతా నేలకేసి కొట్టాడు. పిచ్చివాడిలా జుత్తు పీక్కున్నాడు. సిన్ని శిలా ప్రతిమలా నిల్చుంది.

కోపాన్ని పిడికళ్ళలో నలిపేస్తుంటే మూలగా కన్పించింది అతనికి.... గొడ్డలి.

సిన్ని గొంతులోంచి కేకరాలేదు... కాని తెగిన గొంతు నరాల్లోంచి ఎగజిమ్మిన రక్తం ఆకాశంలోని మబ్బుల్ని సైతం అభిషేకించినంత వేగంగా జిమ్మింది.

ఆ రక్తపు మడుగునే చూస్తూ కూచున్నాడు పరంధాములు.

వాడిలో దుఃఖం లేదు. ఆవేదనలేదు.... కసి ...కసి...

తెల్లారక ముందే వూరు ఉలిక్కిపడి లేచింది. కల్లోలం.... అల్ల కల్లోలం.... మబ్బులింకా పోలేదు. జనం పోగయ్యారు.

పూర్తి తెల్లారకనే పోలీసు జీపు వచ్చింది.

వూరి వాళ్ళకు ఎప్పుడొచ్చాడో తెలీదు కాని.... పోలీసు జీపెక్కుతున్న 'పరంధాములు' కన్పించాడు.

జీపెక్కిన పరంధాములు చేతికేసిన బేడీలవైపు చూసుకున్నాడు. ప్రక్కనే కూచున్న కానిస్టేబులు.

"పిచ్చోడా పెండ్లాన్ని గాలికొదిలేసి డబ్బుకోసం ఏళ్ళ తరబడి దేశాలు పట్టుకుపోతే అది మాత్రం ఏం జేస్తుంది?

దానికి కోరికలుంటాయి.

వాటిని మగాడు తీర్చాలే తప్ప... నువ్వు పంపిన టేప్‌రికార్డర్‌లు, వాచీలు, డబ్బు తీరుస్తుందా? ఆలోచిస్తే దాని తప్పేం లేదు. ఏళ్ళ తరబడి పోయిన నీలోనే మిస్టేకుంది" అన్నాడు.

పరంధాములకేదో జ్ఞానోపదేశం చేసినట్టయింది. అప్పుడు ఏడ్చాడు బావురమని. తను భార్యను ఏమాత్రం సుఖపెట్టింది తెలిసి.

వూరి జనమంతా జాలిగా చూస్తున్నా.... ఆ గుంపులోంచి ఒకే ఒక వ్యక్తి గుంభనగా నవ్వేకుంది.

ఆమె సామిరెడ్డి భార్య.

ఇంకా రోజురోజుకీ మొగుడు దూరమవటం ఇష్టంలేక 'అన్ని విషరాల్తో' అజ్ఞాత ఉత్తరం పరంధాములకు పంపి.... సిన్నిని వదిలించు కున్నందుకు.

పరంధాములు ఏడ్పు.... కదిలిన జీపు చక్రాల కిందపడి నలిగి పోతోంది.

★